క్లుప్తంగా

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తి రస సంగీత సంస్థ ఆడిటోరియంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణామాచార్యులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణ భక్తి గీతాలతో వేడుకలు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేస్తామని తెలిపారు. తదుపరి సంకురాత్రి మంజరి సంగీత కళాశాల విద్యార్థులు శ్రీకృష్ణ గానమృతం సంగీత కచేరీ చేస్తారని తెలిపారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి



బాలభవన్ విద్యార్థులతో ప్రత్యేక అధికారి జయశ్రీ

కాకినాడ కల్చరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జవహర్ బాలభవన్ సంచాలకులు, ప్రత్యేక అధికారిణి జయశ్రీ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని బాలభవన్‌ను ఆమె సోమవారం సందర్శించారు. ప్రతి తరగతిని సందర్శించి విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షించారు. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెడళ్లు అందజేశారు. విద్యార్థుల ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. భవన్ పర్యవేక్షకురాలు ఎ.శారద సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోండి

కాకినాడ సిటీ: తన భర్త షేక్ తాహెరు బాషాకు రెండు కిడ్నీలు పాడైపోయాయని, తనకు ఉండేందుకు ఇల్లు లేదని, ఉంటున్న ఇంటి అద్దె కట్టలేకపోతున్నామని, తనను ఆదుకోవాలని తూరంగి మహాలక్ష్మినగర్‌కు చెందిన షేక్ తాహెరు ఉన్నీసా బేగం సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతిపత్రం అందజేశారు. తన భర్తకు నెలకు 12 సార్లు డయాలసిస్ చేస్తున్నారన్నారు. తమ కుటుంబానికి నిలువ నీడ లేదని రూ.2 వేలు అద్దెకు తీసుకుని చిన్న గదిలో కాపురం చేస్తున్నామని తమకు ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి సందర్శన



ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: స్థానిక సాంబమూర్తినగర్‌లో నిర్మాణంలో ఉన్న ఈఎస్‌ఐ ఆసుపత్రిని సోమవారం బీజేపీ సిటీ అసెంబ్లీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. 2024 జనవరిలో ఇది ప్రారంభం అవుతుందని సత్యనారాయణ అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ 66 వేల మంది కార్మికులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బీజేపీ సౌత్ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్, నాయకులు పానకాల రామకృష్ణ, అనపర్తి వెంకటేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ధర్నా

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం చేపట్టిన సమరభేరి ప్రచార ఉద్యమంలో భాగంగా సోమవారం స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు ధర్నా చేశారు. మోదీ అధికారం చేపట్టాక సామాన్యులపై మోయలేని భారాలు వేస్తున్నారని వారు విమర్శించారు. అనంతరం వెయ్యి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వరహాలయ్యకు అందజేశారు. సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజు, ప్రసాద్, చంద్రమళ్లపద్మ తదితరులు పాల్గొన్నారు.

'గుడాల' మృతి దళితులకు తీరని లోటు



కృష్ణ సంతాప సభలో నివాళులర్పిస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: దళితుల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన గుడాల కృష్ణ ప్రజల మనసుల్లో నిలిచి పోయారని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు అయితాబత్తుల రామేశ్వర రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, డాక్టర్ మోకా పవన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కాకినాడ అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ యూనిట్ టైట్ ఫోరం, ఎస్సీ, ఎస్టీ యూనిట్ ఫోరంల ఆధ్వర్యంలో కృష్ణ సంతాప సభ నిర్వహించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సబ్బతి ఫణీశ్వర రావు, సిద్ధాంతుల కొండబాబు, బచ్చల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలనకు రారండోయ్..

- ఆలయాలు, సత్రాల కమిటీల నియామకానికి నోటిఫికేషన్
- సభ్యుల్లో సగం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు..



కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం

బోట్‌క్లబ్: నగరంలో దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయ కమిటీల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. నగరంలో 20కి పైగా ఆలయాలు, 10 సత్రాలు ఉన్నాయి. వీటిలో పదవీ కాలం పూర్తయిన దేవాలయాలు, సత్రాలకు నూతన కమిటీలను నియమించాల్సి ఉంది. దేవదాయశాఖ చట్టం ప్రకారం మొత్తం సభ్యుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులానికి చెందిన వారై ఉండాలి. అలాగే 50 శాతం మహిళలకు కేటాయిస్తున్నారు. పాదయాత్ర సమయంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారు. ఆలయ కమిటీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు.

కమిటీ సభ్యుల అర్హతలు ఇవీ..

- ఆలయంలో ప్రధాన అర్చకుడు ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు.
- దరఖాస్తుదారుని వయస్సు 30 సంవత్సరాలు పైబడి ఉండాలి.
- అభ్యర్థులు హిందువులై ఉండాలి. అభ్యర్థుల ప్రవర్తన, నడవడిక బాగుండాలి.
- ధర్మకర్తల మండలిలో డోనార్‌ను సభ్యునిగా నియమించాలి.
- అభ్యర్థులను విచారించే సమయంలో పోలీస్ విచారణ సర్టిఫికేట్, కుల ధ్రువీకరణ పత్రం, మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాలి
- దరఖాస్తులను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

ఇవి అనర్హతలు..

- ఆలయానికి, లేదా సత్రానికి వ్యతిరేకంగా పని చేయ కూడదు
- దేవదాయ, లేదా సత్రం భూములు, షాపులు, కౌలు, అద్దెకు తీసుకున్నవారు.
- దేవదాయ, లేదా సత్రాలతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగానీ లావాదేవీలు చేసేవారు.
- వరుసగా రెండు సార్లు ధర్మకర్తగా పనిచేసినవారు
- ఐపి పెట్టిన వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు
- జైలు శిక్ష అనుభవించిన వారు. క్రిమినల్ కేసులో ముద్దాయిగా ఉన్నవారు. నేర చరిత్ర కలిగిన వారు.

50 శాతం మహిళలకు

ఆలయాలు, సత్రాల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. కాకినాడ నగరంలో ఇప్పటికే సూర్యారావుపేటలో బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయానికి ఇటీవల నూతన కమిటీ నియామకం పూర్తి అయ్యింది. దీనిలో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించారు. నూతన కమిటీల్లోను 50 శాతం మహిళలు ఉండాలని నోటిఫికేషన్‌లో దేవాదాయశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నగరంలో కమిటీల్లో 50 శాతం మహిళలకు అవకాశం లభించనుంది.

ఇచ్చిన మాట నిలుపుకొన్నారు



మహిళలను అన్ని రంగాల్లోను ముందుకు తీసుకు వెళ్తామని పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్ మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం దేవదాయశాఖ ఆలయ కమిటీల్లో సైతం అవకాశం కల్పించారు. ఇటీవల తనను బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయానికి సభ్యురాలిగా ఎంపిక చేశారు.

స్వయంవరపు వరలక్ష్మి, బాలాత్రిపుర సుందరి ఆలయ కమిటీ సభ్యురాలు

నిబంధనల ప్రకారం నియామకం



నిబంధనల ప్రకారం నూతన కమిటీల నియామకం జరుగుతుంది. ఇప్పటికే నగరంలో నూతన కమిటీల నియామకానికి దేవదాయశాఖ డీసీ, జిల్లా దేవదాయ శాఖాధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు. 20 రోజుల్లో తాము ఇచ్చిన ఫార్మెట్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే వారిని సభ్యులుగా నియమిస్తాం.

వడ్డి ఫణికుమార్, ఇన్‌స్పెక్టర్ దేవదాయశాఖ, కాకినాడ డివిజన్

విలక్షణ రాజకీయం 'బందన' సొంతం

సంతాప సభలో ఎమ్మెల్యే ద్వారంపూడి



వృద్ధురాలికి దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ బందన హరి వంటి నిస్వార్థ రాజకీయ నాయకులు అరుదుగా ఉంటారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన మత్స్యకార నాయకుడు హరి సంతాప సభ స్థానిక జగన్నాథపురంలో సోమవారం జరిగింది. ఎమ్మెల్యేతో పాటు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మృదు స్వభావిగా, సౌమ్యుడిగా, పది మందికీ సహాయపడే వ్యక్తిగా బందన తనకంటూ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారన్నారు. ఇటువంటి వ్యక్తిత్వం కలిగిన నాయకులు రాజకీయాల్లో చాలా అరుదని అన్నారు. ఆయనను దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతగానో ఇష్టపడేవారన్నారు. అందువల్లే ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే తొలి అగ్ని కులక్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆయనకు ఇచ్చారన్నారు. ఆయన మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తనకు ఎంతో లోటన్నారు. కాకినాడ మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మత్స్యకార నాయకులు కాటాడి జానకిరామ్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, సంగాని నందం, చెవ్వాకుల రాంబాబు, నాయకులు, కార్యకర్తలు మత్స్యకార పెద్దలు పాల్గొన్నారు.

పింఛన్‌తో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కొత్త పింఛన్లు పంపిణీ




రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో కొత్త పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకతో ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని అర్బన్ ఎనిమిది డివిజన్ల పరిధిలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. అర్హత ఉండి రాని వారికి, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేస్తుందని, కొత్తగా 99 మందికి పింఛన్లు అందించామన్నారు. మరో 658 మందికి పింఛన్లు మంజూరు అయ్యాయని వాటిని త్వరలో అందిస్తామన్నారు. త్వరలో రూ.3వేలు చొప్పున పింఛన్లు అందజేస్తారన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో వృద్ధులకు ప్రతి నెల వారి ఇంటి వద్దే ఒకటో తేదీన పింఛన్ సొమ్ము నేరుగా అందజేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జమ్మల మడక నాగమణి, మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, వాసిరెడ్డి సూరిబాబు, ఐ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అలీమ్

- చేసిన సేవలకు గుర్తింపు
- నేడు పురస్కారం స్వీకరణ



కరప: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలం నుంచి ఎమ్‌ఏ అలీమ్ ఎంపికయ్యారు. యండమూరులోని మండల ప్రాథమిక పాఠశాలలో స్కూలు అసిస్టెంట్‌గా ఆయన పనిచేస్తున్నారు. 2008లో డీఎస్సీ ద్వారా ఎంపికై జెడ్.భావారంలో ఉపాధ్యాయునిగా చేరారు. 2013లో కూరాడ శివారు చినమామిడాడ పాఠశాలలో 8 ఏళ్లు పని చేశారు. ప్రస్తుతం యండమూరులో పనిచేస్తున్నారు. కరప, పెద్దాపురప్పాడు కాంప్లెక్స్ సెక్రటరీగా పనిచేశారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యనందిస్తూ, ఆయన పని చేసిన పాఠశాలల అభివృద్ధికి, మౌలికవసతుల కల్పనకు కృషిచేసి అందరి మన్ననలు పొందారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు సహచరులతో చేయూత స్వచ్ఛంద సంస్థను స్థాపించి ప్రధాన కార్యదర్శిగా సేవ చేస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడమే కాకుండా, 20 సార్లు రక్తదానం చేశారు. కరోనా సమయంలో నిత్యావసరాలు, దివ్యాంగులకు ట్రైసైకిల్స్ అందజేశారు. కాకినాడ రోటరీ క్లబ్ సహకారంతో, రోటరీ, చేయూత భవన్ నిర్వహిస్తూ 25 మంది చిన్నారులకు ఉచిత విద్య, వసతి అందిస్తున్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి సహకారంతో చేయూత సంస్థ ద్వారా కాకినాడ జీజీహెచ్‌లో నిత్యం 850 మందికి భోజనం అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అన్ని ఉపాధ్యాయ సంఘాల సూచనల మేరకు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎంపికచేశారు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టర్, డీఈఓల నుంచి అలీమ్ ఉత్తమ పురస్కారం అందుకోనున్నారు.

ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం

- మేనేజర్ కర్రి సత్యనారాయణ
- డయల్ యువర్ కమిషనర్‌కు 21, స్పందనకు 5 వినతుల స్వీకరణ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ

కాకినాడ: ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్యకూ నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని నగరపాలక సంస్థ మేనేజర్ కర్రి సత్యనారాయణ హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను నిర్వహించారు. కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశాల మేరకు మేనేజర్ కర్రి సత్యనారాయణ ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 21 మంది, స్పందన ద్వారా ఐదుగురు వివిధ సమస్యలు విన్నవించారు. తాగు నీరు, పారిశుధ్యం, డెబ్రిస్ తొలగింపు, వీధి దీపాల నిర్వహణ వంటి సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకురాగా, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. మేనేజర్ మాట్లాడుతూ న్యాయ, ఆర్థిక పరమైన అంశాలు మినహా ఇతర సమస్యన్నింటినీ ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరిస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ప్రక్రియను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, డిఈలు మాధవి, సుబ్బారావు, టీపీఆర్వో కృష్ణమోహన్, వివిధ విభాగాల అధికారులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జి-20 సదస్సుపై మాక్ డ్రిల్



జి-20 సదస్సులో దేశ ప్రతినిధిగా ప్రసంగిస్తున్న విద్యార్థిని

బాలాజీచెరువు: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే జి-20 దేశాల సదస్సుపై సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యార్థుల్లో అవగాహన కలిగించడానికి ఎంఎస్ఎన్ చారిటీస్ పాఠశాలలో సోమవారం ఒకొక్క దేశ ప్రతినిధిగా ఒకొక్క విద్యార్థిని నియమించి సదస్సు లక్ష్యాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ఏయే దేశాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి, శక్తి వనరులు పొదుపుగా వినియోగించుకోవడానికి జి-20 దేశాల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, నేషనల్ గ్రీన్‌కోర్ కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, అధ్యాపకులు అలపాటి శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీహరిరావు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు కృషి చేయండి

- ఆచార్య రంగా వ్యవసాయ వర్సిటీ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యుడు ఈశ్వరరావు



పెదకొత్తూరులో శాస్త్రవేత్తలతో కలసి పొలాలను పరిశీలిస్తున్న ఈశ్వరరావు

కరప: పంట కాలంలో రైతులకు తగిన సలహాలు, సూచనలిస్తూ అధికదిగుబడులు సాధించేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషిచేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యుడు చింతా ఈశ్వరరావు సూచించారు. సోమవారం పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు పెదకొత్తూరు వచ్చి ఈశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పంటల పరిస్థితిని ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. కొత్త రకాలు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలని శాస్త్రవేత్తలకు ఆయన సూచించారు. అనంతరం పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం, కో ఆర్డినేటర్, సైంటిస్ట్ డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఎస్‌ఆర్ శర్మ, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.బాలాజీనాయక్‌లతో కలసి పంట పొలాలను ఆయన పరిశీలించారు.


సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సార్వాసీజన్‌లో వరిపంటపై ఆకు ఎండుతెగులు, మాగుడు వచ్చే అవకాశం ఉందని రైతులు అప్రమత్తమై సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నున్న వీరబాబు, చోడిశెట్టి చంటి, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో కమ్యూనిటీ హాలు నిర్మాణం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
- 46వ డివిజన్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

కాకినాడ: సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం తోడ్పడుతుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 46వ డివిజన్ మహాత్మవీధి, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యల అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సచివాలయ పరిధికి రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మాజీ కార్పొరేటర్లు కె.బాలాప్రసాద్, కొలగాని దుర్గాప్రసాద్, నాయకులు మేరీ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: పసి పిల్లలపై లైంగిక వేధింపులను నివారించే దిశగా పడాల చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నట్టు కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పడాల చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆర్జేడీ నాగమణితో పాటు కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఉన్న పిల్లలకు సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, సేఫ్టీ రూల్స్, పోక్సో చట్టం, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి విషయాలపై పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ (పీఎస్ఈ) మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. కాకినాడ రోటరీ క్లబ్ సహకారంతో జిల్లాలో 75 వేల మంది చిన్నారులకు ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రాజెక్టు మేనేజర్ పద్మావతి, సీఈవో సూర్యప్రసాద్, రోటరీ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్కరాజు సత్యనారాయణ, కార్యదర్శి బాబీ తదితరులు పాల్గొన్నారు.

డీఈలకు ఈఈలుగా పదోన్నతి



ఈఈ మాధవి

కాకినాడ: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు డీఈలకు ఈఈలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పుర పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మాధవి ఇక్కడే పదోన్నతిపై ఈఈ నియమితులయ్యారు. కాగా మరో డీఈ శ్రీనివాస ప్రసాద్ విశాఖకు ఈఈగా బదిలీ అయ్యారు. పదోన్నతి పొందిన డీఈలను నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఎస్ఈ సత్యకుమారి, అధికారులు అభినందించారు.

నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ప్రకృతి ఇచ్చిన సహజ వనరులలో నీటి వనరులను రక్షించి భావితరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛ పక్వాడలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జలవనరులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛత పాటించాలన్నారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించగా పేరెంట్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని పాస్టర్‌కు గాయాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాస్టర్ వంకా జాన్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం మోటారు సైకిలుపై కాకినాడ వెళ్తున్న శాంతి బాప్టిస్టు చర్చి పాస్టరును కాకినాడ నుంచి వస్తున్న లారీ వీకే రాయపురం సమీపంలో ఢీకొంది. దాంతో జాన్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రికి జాన్‌ను చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం స్వామి వారికి ప్రీతైన సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఉప ఆలయాలల్లోని స్వామి వార్లు, అమ్మవార్లకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయగా ట్రస్టు బోర్డు సభ్యులు భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరిశీలించండి



సామర్లకోట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన మానవ హక్కుల సంఘు నాయకులు

సామర్లకోట: కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులను దోపిడీ చేయడానికి బస్సులు నడుపుతున్నాయని జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారికి ఆయా విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌లను పరిశీలించాలని వినతి పత్రం అందజేశారు. ఇటీవల సామర్లకోట ఒక విద్యా సంస్థకు చెందిన బస్సు చక్రం ఊడిపోవడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మానవహక్కుల సంఘ నాయకులు జుత్తుక అప్పారావు, కుంచే నానిబాబు, ఎండీ వలీబాషా తదితరులు పాల్గొన్నారు.